క్లుప్తంగా

మంత్రి కృషి మరువలేనిది



కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్‌): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తంచేస్తూ అందోలు మాదిగ దండోరా నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పై యేళ్ల అలుపెరుగని పోరాటంలో మాదిగ ఉప కులాల కల నెరవేరిందని, అందుకు మంత్రి కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పి.సంజీవయ్య, గుండెగల్ల మల్లయ్య, డప్పు సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌ కోసం చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న ఏఈ

పటాన్‌చెరు టౌన్‌: గుమ్మడిదల మండల పరిధిలో దోమడుగు, బొంతపల్లి వివిధ గ్రామాల్లో బొంతపల్లి విద్యుత్‌ శాఖ ఏఈ రవీందర్‌ ఆదివారం పర్యటించారు. వినియోగదారులకు విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వినియోగదారుల దగ్గరికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయనతోపాటు వినియోగదారులు, విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌నేతల అభినందనలు



సంజయ్‌ను సన్మానిస్తున్న వంశీ

సంగారెడ్డి: టీపీసీసీ లీగల్‌ సెల్‌ వైస్‌ చైర్మన్‌ పి.సంజయ్‌ కుమార్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌ నాయకుడు వంశీ యాదవ్‌ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజయ్‌ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటూ అభినందనలు తెలిపారు. నియామకానికి సహకరించిన రాహుల్‌ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్‌ రాజు యాదవ్‌, విష్ణువర్ధన్‌ రెడ్డి పాల్గొన్నారు.

కుట్రలను తరమికొడతాం



సమావేశంలో ఐక్యవేదిక నేతలు

నారాయణఖేడ్‌: ఎస్సీల వర్గీకరణ పేరిట దళితులను విచ్ఛిన్నంచేసే మనువాద కుట్రను తరిమికొడదామని మాలల ఐక్యవేదిక నాయకులు భీంసేన, కొటారి నర్సింహులు, దేవరాజు, శ్రీనివాస్‌, పండరి, రాము తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్‌ భవన్‌లో నిర్వహించిన డివిజన్‌ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో రాజ్యాంగాన్ని తొలగించే కేంద్రప్రభుత్వ కుట్రలో భాగమే వర్గీకరణ అని విమర్శించారు. మాలల ఐక్యత చాటేందుకు ఈనెల 6న ఖేడ్‌లో భారీర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో గౌతం, మోహన్‌, గణేశ్‌, అరుణ్‌కుమార్‌, బస్వరాజ్‌, శంకర్‌, సిద్ధు, నారాయణ, సంజయ్‌ కుమార్‌ జైభీం, సురేశ్‌, సంతోష్‌, నర్సింహులు, విజయ్‌ పాల్గొన్నారు.

పరిశుభ్రతా చర్యలు



శుభ్రం చేస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్‌: ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రమేశ్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏరియా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

సీపీఎం విరాళాల సేకరణ

సంగారెడ్డి టౌన్‌: కేరళలోని వయనాడ్‌ జిల్లాలో కొండ చర్యలు విరిగి వరదలలో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి సంగారెడ్డి పట్టణంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, యాదగిరి, అశోక్‌, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో రాజీవ్‌ పార్కు

- నిరుపయోగంగా ఆటవస్తువులు
- కుక్కలు, పందుల స్వైరవిహారం
- ధ్వంసమైన జిమ్‌ పరికరాలు
- పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి: జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఉన్న రాజీవ్‌ పార్కు పరిస్థితి చాలా అధ్వానంగా తయారైంది. 2010లో ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్య హయాంలో రూ.1.35కోట్లతో నిర్మించిన ఈ పార్కులో ఇప్పుడు కనీస సౌకర్యాలే కరువయ్యాయి. నిత్యం ప్రజలు సేదతీరే పార్కులో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. పార్కుకు వచ్చిన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ హయాంలో పార్కును పట్టించుకోలేదని కనీసం ఈ కాంగ్రెస్‌ ప్రభుత్వమైనా పార్కును మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆటవస్తువులు

సరదాగా ఆడుకుందామని పార్కుకు వస్తున్న చిన్నారులకు నిరాశే ఎదురవుతోంది. పార్కులో సుమారు 50కి పైగా ఆట వస్తువులు ఉన్నపటికీ అవన్నీ పూర్తిగా చెడిపోయాయి. కొన్ని మరమ్మతులకు గురవడంతో చిన్నారులు ఆడుకుందామని ఎక్కి గాయాలపాలవుతున్నారు. అదేవిధంగా మరుగుదొడ్లు ఉన్నప్పటికీ ధ్వంసమై వినియోగానికి నోచుకోలేదు. కుక్కలు, పందులకు ఆవాసాలయ్యాయి.

పిచ్చి మొక్కలు, కుక్కలు

పార్కులో ఎటుచూసినా పిచ్చిమొక్కలు, పొదలు దర్శనమిస్తున్నాయి. ఏ విషసర్పాలతో ఏప్రమాదం జరుగుతుందోనన్న పార్కుకు వచ్చిన జనాలు భయాందోళనకు గురవుతున్నారు. కొందరు దీన్ని అలుసుగా తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు. అలాగే గుంపులుగుంపులుగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చిన్నారులను ఆడుకోవడానికి పంపాలంటేనే భయపడుతున్నారు. పశువులను మేతకోసం వదులుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు.



పార్కులో సంచరిస్తున్న పశువులు

పాడైన ఫౌంటేన్‌.. జిమ్‌ వస్తువులు

పార్కులో అప్పటి ముఖ్యమంతి కిరణ్‌ కుమార్‌రెడ్డి హయాంలో నిర్మించిన జలవిహార్‌ మూలన పడింది. అలాగే జిమ్‌ వస్తువులు తుప్పు పట్టి పనికి రాకుండా పోయాయి. అధికారు స్పదించి పార్కును వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పాడైన ఫౌంటేన్‌

పార్కును బాగుచేయాలి



నిత్యం వాకింగ్‌ కోసం పార్కుకు వస్తుంటాం. వ్యాయామం చేద్దామంటే ఆ వస్తువులన్నీ తుప్పుపట్టి పాడుపడ్డాయి. వినియోగిస్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో ఎవరూ చేయలేని పరిస్థితి. వెంటనే వాటిని బాగు చేయించాలి.

– రఘురామ్‌, రిటైర్డ్‌ ఉద్యోగి

స్నేహానికి మించింది లేదు

లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్‌ డే వేడుకలు

సంగారెడ్డి రూరల్‌/జహీరాబాద్‌ పటాన్‌చెరు టౌన్‌: ప్రపంచంలో స్నేహానికి మించినది మరొకటి లేదని లయన్స్‌ క్లబ్‌ పిలిగుండ్ల రాములు గౌడ్‌ అన్నారు. ఆదివారం లయన్‌ జార్జ్‌ మాథ్యూ అధ్యక్షతన రుద్రారం కిరణ్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసుకుని సందడిగా గడిపారు. కార్యక్రమంలో విజయేందర్‌ రెడ్డి, వెంకటేశం, హన్మంత్‌ గౌడ్‌, రామప్ప, కృష్ణ, రజనీ కాంత్‌, జి.వెంకన్న, సునీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు. కోహీర్‌ మండలంలోని దిగ్వాల్‌ గ్రామంలోని జీఎంఆర్‌ కళాశాలలో పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రకాశ్‌, శ్రీనివాస్‌యాదవ్‌, శేఖర్‌, శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్‌, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు. పటాన్‌చెరు టౌన్‌ మండలంలోని ముత్తంగిలో పలువురు యువకులు కేక్‌ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



సంగారెడ్డి రూరల్‌: వేడుకలు జరుపుకుంటున్న లయన్స్‌ క్లబ్‌ సభ్యులు

బాలుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: బాలుడు అదృశ్యమన ఘటన స్థానిక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బిహార్‌కు చెందిన ఓ కుటుంబం పటాన్‌చెరు మండలం లక్డారం గేట్‌ సమీపంలో ఉంటూ లేబర్‌ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు 15రోజుల క్రితం బిహార్‌ నుంచి వచ్చాడు. ఈ క్రమంలో 2న చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడు. బాలుడు అదృశ్యంపై అతడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నోట్‌ పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో సిబ్బంది

కల్హేర్‌(నారాయణఖేడ్‌): సిర్గాపూర్‌ సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు ఆదివారం నోట్‌ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం తరఫున విద్యార్థులకు అందజేసినట్లు వార్డెన్‌ కిషన్‌ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో వసతులు కలిపిస్తోందని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- పూర్తిగా ధ్వంసమైన రెయిలింగ్‌
- రెండువైపులా భారీ గుంతలు
- పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు
- దృష్టిసారించని అధికారులు



సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి(కల్వర్టు)ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన దాదాపు వంద యేళ్ల క్రితం నిర్మించింది కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికి రెండు వైపులా రెయిలింగ్‌ కూలిపోవడంతో వాహనదారులు భయంతో రాకపోకలు సాగిస్తున్నారు.

గుంతల్లో పడి ప్రమాదాలు

ప్రతిరోజు పదుల సంఖ్యలో స్కూల్‌ బస్సులు, ఆటోలు, బైకులు, ఎడ్ల బండ్లు తిరుగుతుంటాయి. బ్రిడ్జి ప్రమాదకరంగా ఉండడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామానికి కొత్తగా వచ్చే వారు బ్రిడ్జికి రెండువైపులా ఉన్న భారీ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. కల్వర్టుకు రెండు వైపులా పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడం వల్ల పక్కనున్న గుంతలు కనబడడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

వర్షాకాలంలో మరింత..

వర్షాకాలంలో గంగకత్వ నుంచి వచ్చే నీటితో పాటు ఎన్కేపల్లి, వెంకటాపూర్‌ మధ్యలోని చెరువులు నిండినప్పుడు ఈ కల్వర్టు నుంచి మొగుల చెరువుకు నీరు ప్రవహిస్తుంది. దీంతో వర్షాకాలంలో కల్వర్టుపై ప్రయాణం మరింత ప్రమాదకరం అని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నామని వాహనదారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నూతనంగా బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.

– సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి)

అ'పూర్వ'సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మెదక్‌ జిల్లా అల్లాదుర్గంలో 1995–96లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌ హాలులో నిర్వహించారు. 29యేళ్ల అనంతరం కలుకొన్న వారంతా ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

– సంగారెడ్డి కల్చరల్‌

పట్టించుకోరూ..?



క్రీడా ప్రాంగణాన్ని తవ్వేసిన దృశ్యం

మండల పరిధిలోని గౌర్రెకల్‌లో రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టరు క్రీడా ప్రాంగణాన్ని తవ్వేసి మట్టిని తరలించుకొనిపోయారు. ఈ విషయాన్ని గత నెల 28న సాక్షి దినపత్రికలో 'చెరువుకుంటగా క్రీడా ప్రాంగణం' అనే శీర్షికతో కథనం ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. అయినా అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వం ఒక్కో క్రీడా ప్రాంగణానికి ఈజీఎస్‌ పథకం కింద రూ.2 లక్షలు మంజూరు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల క్రీడా ప్రాంగణాలు రూపురేఖలు లేకుండా పోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

– వట్‌పల్లి(అందోల్‌)



పటాన్‌చెరు: చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి ఆపన్న హస్తంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 179మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.63.28లక్షల విలువైన చెక్కులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ప్రారంభం కానుందని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్‌ పుష్ప నగేశ్‌, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కోలన్‌ బాల్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు ప్రమోద్‌ గౌడ్‌, ఐలేశ్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..

నారాయణఖేడ్‌: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. నాగల్‌గిద్ద మండలం గీమాతండాకు చెందిన ప్రేమ్‌సింగ్‌కు రూ.30వేలు, రుద్రారంనకు చెందిన శరణుగొండకు రూ.9వేలు మంజూరు కాగా ఆయా చెక్కులను ఆదివారం బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో ఆయన వారికి అందజేశారు. మనూరు మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు విఠల్‌ రావు, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో మృతిచెందిన తుర్కపల్లికి చెందిన బంటుకళావతి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పరమేశ్‌, శ్రీనివాస్‌ రెడ్డి, భూమయ్య, విఠల్‌ గౌడ్‌, అంజిరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

శ్రావణ మాసం పూజలు ప్రారంభం



ఝరాసంగం(జహీరాబాద్‌): స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవ్‌ రెడ్డి

జహీరాబాద్‌ టౌన్‌/న్యాల్‌కల్‌(జహీరాబాద్‌)/రాయికోడ్‌(అందోల్‌): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆలయాలు సందడిగా మారాయి. ఆదివారం నుంచి శ్రావణ మాసం ప్రారంభకావడంతో పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. జహీరాబాద్‌ టౌన్‌ పరిధిలోని అల్గోల్‌ రోడ్డులో గల శ్రీసిద్ధేశ్వర ఆలయంతోపాటు శివాలయం, సోమేశ్వర ఆలయాలలోను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాల్‌కల్‌ మండల పరిధిలోని ప్రధాన ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆదివారం అమావాస్య కావడంతో పాటు ఆషాఢ మాసం చివరి రోజు కావడంతో భక్తులు ప్రధాన ఆలయాలకు క్యూ కట్టారు. ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం, రేజింతల్‌లోని సిద్ధివినాయక ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఝరాసంగంలో కేతకీ సంగమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పలువురు భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. అలాగే రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు.

ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి పూజలు

ఝరాసంగం(జహీరాబాద్‌): బర్దీపూర్‌ శ్రీదత్తగిరి మహారాజ్‌ ఆశ్రమం, మొగలివనంలోని కేతకీ సంగమేశ్వర ఆలయం, మాచ్నూర్‌ రామేశ్వర ఆలయంలోను ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అధికారులు, నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయా ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్‌, నాయకులు ముల్తాని, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, షకీల్‌, అమృత్‌, సిద్ధారెడ్డి, దత్తు, బర్దీపూర్‌ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ108వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్‌, డా.సిద్ధేశ్వరస్వామి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలను మెరుగుపర్చాలి

జహీరాబాద్‌ టౌన్‌: పర్యవేక్షణలేక అలంకార ప్రాయంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్‌ చేశారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలువురు నేతలు పట్టణంలోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు ఆటలాడేందుకు గత ప్రభుత్వం రూ.70వేల చొప్పున నిధులు ఖర్చుచేసి క్రీడా ప్రాంగణాలను నిర్మించిందన్నారు. కాని అవన్నీ పర్యవేక్షణ లేక పిచ్చి మొక్కలతో నిండిపోయాయని వాపోయారు. అందరికీ ఉపయోగపడే క్రీడా ప్రాంగణాలను శుభ్రంచేసి ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్‌ చేశారు. సీపీఎం నాయకులు సీమొద్దీన్‌, బక్కన్న, నరేశ్‌ తదితరులు ఉన్నారు.



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నేతలు

సంక్షిప్త వార్తలు

◆ **ఎస్సీ వర్గీకరణపై సంబురాలు**

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మండలంలోని బీబీపేట్‌లో ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మాణిక్‌ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ, మాదిగ ఉపకులాలకు లబ్ధి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు అమృత్‌ బండారి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నాం అనిల్‌ రెడ్డి, నాయకులు రాహుల్‌ చంద్రపాల్‌, కార్తీక్‌, జీవన్‌, సైదయ్య, అశోక్‌, ఫిలిప్‌, నారాయణ, సాయిబాబా పాల్గొన్నారు.

◆ **పాస్పరెట్‌ ప్రెస్బిరెటర్‌ ఇన్‌చార్జిగా కుమార్‌**

కల్హేర్‌(నారాయణఖేడ్‌): మండలంలోని కృష్ణాపూర్‌ పాస్పరెట్‌ ప్రెస్బిరెటర్‌ ఇన్‌చార్జిగా కుమార్‌ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ప్రెస్బిరెటర్‌ ఎం.ప్రసాద్‌ నిజామాబాద్‌ జిల్లా మాచెర్ల పాస్టరెట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కుమార్‌ను డీసీసీ ప్రాపర్‌ సెక్రటరీ దావదాస్‌ సన్మానించారు. లోకల్‌ సెక్రటరీ స్వామిదాస్‌, సాయిలు, మాణిక్యం, ఆనందం దేవదాస్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ **పదోన్నతులు పొందిన వారికి సత్కారం**

జహీరాబాద్‌: ఉపాధ్యాయులంతా విద్యార్థులలో దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించాలని ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రాంత బౌద్ధిక్‌ ప్రముఖ్‌ జయదేవ్‌ పిలుపునిచ్చారు. డివిజన్‌ పరిధిలో పదోన్నతి పొందిన 70 మంది ఉపాధ్యాయులను ఘనంగా శనివారం సత్కరించారు. కార్యక్రమంలో తుక్కప్ప, అడివప్ప, గోపాల్‌, నర్సింహారెడ్డి, బస్వరాజ్‌, దశరథ్‌, తుకారాం, కృష్ణ, విజయలక్ష్మి, కె.లక్ష్మి, శ్రీపాల్‌, నరేందర్‌ పాల్గొన్నారు.

◆ **పరిశ్రమలు ఏర్పాటు చేయండి**



నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్‌ఐ యువజన విభాగం జిల్లా కార్యదర్శి అనిల్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో సంఘం డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఖేడ్‌ డివిజన్‌ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడిగా సతీశ్‌, కార్యదర్శిగా మహిపాల్‌, సహాయ కార్యదర్శులుగా ప్రశాంత్‌, ప్రవీణ్‌, కమిటీ సభ్యులుగా స్వరాజ్‌, కుమార్‌లను ఎన్నుకున్నారు.

◆ **18న బోనాలు.**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): స్థానిక పోచమ్మ ఆలయంలో 18న శ్రావణ మాస బోనాలను జరుపుకునేందుకు గ్రామ పెద్దలు ప్రత్యేక సమావేశం నిర్వహించి తేదీని నిర్ణయించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌ పుష్ప నగేశ్‌, ఆలయ కమిటీ అధ్యక్షుడు కరికె సత్యనారాయణతో పాటు పలువురు పెద్దలు పాల్గొన్నారు. పెద్దల అంగీకారంతో 18న ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయ బోనాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ అంజయ్య, ఆలేరు కమిటీ చైర్మన్‌ నిరంజన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **12న ఏఐఎస్‌ఎఫ్‌ ఆవిర్భావ వేడుకలు**

నారాయణఖేడ్‌: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్‌) 88వ ఆవిర్భావ వేడుకలను 12న జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు సీహెచ్‌ అశోక్‌ చెప్పారు. ఆయన మాట్లాడుతూ చదువు, పోరాడు, సాధించు అనే నినాదంతో సంఘం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం 88యేళ్లుగా దేశవ్యాప్తంగా పోరాడుతోందన్నారు. విద్యార్థులు, మేధావులు అధికసంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ **నేడు కంగ్టికి ఎమ్మెల్యే రాక**

కంగ్టి(నారాయణఖేడ్‌): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభించడానికి కంగ్టి మండల కేంద్రానికి ఎమ్మెల్యే డాక్టర్‌ పి.సంజీవ్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్‌ కార్యాలయం నుండి క్రాంతి చౌక్‌ వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొని సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. ప్రజలు, అధికారులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

◆ **భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన**

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని హౌసింగ్‌ బోర్డు కాలనీలో ఆదివారం భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన నిర్వహించారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహించే నగర సంకీర్తనలో పురుషులతో పాటు మహిళలు, పిల్లలు పాల్గొని భగవనామ స్మరణ చేశారు. భజనలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు.

◆ **నేడు శివాలయాలలో ప్రత్యేక పూజలు**

పటాన్‌చెరు టౌన్‌: శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా శివాలయాలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పటాన్‌చెరు టోల్‌గేట్‌ సమీపంలోని శ్రీరామలింగేశ్వర ఆలయం, జేపీ కాలనీలోని ఉమామహేశ్వర ఆలయం, చైతన్య నగర్‌ కాలనీలో మహాదేవుడి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

◆ **మహా రుద్రయాగం..**

నారాయణఖేడ్‌: పట్టణంలోని పురాతన కాశీనాథ్‌ ఆలయంలో 5న మహారుద్ర యాగం, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు మలమంచి గురురాజ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్‌ బావుగి హన్మాండ్లు తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతీ సోమవారం ఈ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని కాశీనాథుడి ఆశీస్సులు పొందాలని కోరారు.